సంపద లేని కేంద్రాలు

- నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు
- నిర్వహణపై దృష్టి సారించని ప్రభుత్వం, అధికారులు



శ్రీరంగరాజుపల్లిలో దుస్థితిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం



శిథిలావస్థకు చేరుకున్న ట్రైసైకిళ్లు

పరిగి: గ్రామాల్లో చెత్తా చెదారాన్ని సేకరించి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చెత్త సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరుగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఉపయోగపడుతుందన్న లక్ష్యంతో ప్రతి పంచాయతీ కేంద్రంలో షెడ్లను నిర్మించారు. గత ఎన్నికల ప్రచార సమయంలో సంపద సృష్టిస్తామని పదే పదే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రస్తావించారు. వేరే సంపద సంగతి అటుంచితే చెత్త నుంచి సంపద సృష్టించి కనీసం గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంచడంపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించడం లేదు.

కానరాని చెత్త శుద్ధి

పెనుకొండ నియోజకవర్గంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలిస్తే.. పెనుకొండ మండలంలో 12, పరిగి 12, రొద్దం 19, సోమందేపల్లి 14, గోరంట్ల మండలంలో 20 ఉన్నాయి. ఇందులో 80 శాతం కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. వీటి నిర్వహణ బాధ్యతలపై అధికారులు దృష్టి సారించకపోవడంతో పాటు గ్రామాల్లో డ్రైనేజీల శుభ్రత అనంతరం సేకరించిన చెత్తనంతా ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా పడేస్తున్నారు. దీంతో ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు.

నిర్వహణకు ప్రత్యేకంగా గ్రీన్ అంబాసిడార్లు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చెత్త సంపద తయారీ కేంద్రాల నిర్వహణకు ప్రత్యేకంగా గ్రీన్ అంబాసిడార్లను నియమించారు. వారి ద్వారా తడి, పొడి చెత్తను సేకరించి షెడ్లలో వేర్వేరుగా నిల్వ ఉంచేవారు. వానపాములను వదిలి మంచి సహజమైన సేంద్రీయ (వర్మీ కంపోస్ట్) ఎరువును తయారు చేసి, కిలో రూ.10 చొప్పున విక్రయించేవారు. ఆ ప్రభుత్వంలోనే గ్రామాల్లో చెత్తను సేకరించడానికి ప్రత్యేకంగా ట్రైసైకిళ్లను కూడా అందించారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం చెత్త సంపద తయారీ కేంద్రాల నిర్వహణను పట్టించుకోకపోవడంతో సంపద మాట పక్కన పెడితే ఉన్న కేంద్రాలు, ట్రైసైకిళ్లు దాదాపు శిథిలావస్థకు చేరుతున్నాయి. పైగా కొన్ని ప్రాంతాల్లోని షెడ్లు మందుబాబులు, పేకాటరాయుళ్లు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు గ్రామ పంచాయతీల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునివ్వడానికి నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రాల నిర్వహణ బాధ్యతను నిర్వర్తించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

> గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. కొన్నిచోట్ల ఆ భవనాలతో పాటు చెత్తను తరలించే ట్రై సైకిళ్లు శిథిలావస్థకు చేరాయి.

వినియోగంలోకి తీసుకురావాలి



శ్రీరంగరాజుపల్లిలో డ్రైనేజీలను నెలకోసారి కూడా అధికారులు శుభ్రం చేయడం లేదు. చేసినప్పుడు చెత్తను సేకరించి బయట పడేస్తుండటంతో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడుతోంది. అయితే నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొస్తే అపరిశుభ్ర సమస్య ఉండదు. పైగా పంచాయతీకి ఆదాయం కూడా వస్తుంది. అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నాం.

– కదిరప్ప, శ్రీరంగరాజుపల్లి

పంచాయతీ అధికారులదే బాధ్యత



చెత్త సంపద తయారీ కేంద్రాల నిర్వహణ బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే. వీటిని గతంలో వినియోగించడం వల్ల పంచాయతీకి ఆదాయంగా ఉండేది. ఇటీవల కాలంలో నిర్వహణ లేకుండా నిరుపయోగంగా ఉన్న మాట వాస్తవమే. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పంచాయతీ విస్తరణాధికారులతో సమావేశం ఏర్పాటు చేసి వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తాం.

– రెడ్డప్ప, ఎంపీడీఓ, పరిగి

క్లుప్తంగా

మధుమతిరెడ్డికి సన్మానం



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మధుమతిరెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన చౌళూరు మధుమతిరెడ్డికి చౌళూరులో వైఎస్సార్‌సీపీ నేతలు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ మేరకు శనివారం నియామక ఉత్తర్వులు విడుదలైన విషయం తెలిసిందే. ఇప్పటికే ఆమె పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. తాజాగా ఆమెకు పదవి దక్కడంపై హిందూపురం రూరల్ మండల వైఎస్సార్‌సీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. సన్మాన కార్యక్రమంలో ఎంపీపీ రత్నమ్మ, వైస్ ఎంపీపీ రామాంజి, ఎంపీటీసీ కృష్ణవేణి, సర్పంచ్ నంజప్ప, మాజీ సింగిల్‌విండో రంగనాథ్, మాజీ సర్పంచ్ రాజు, సీనియర్ నాయకుడు తిమ్మారెడ్డి, చంద్ర, సంతేబిదనూరు రాజు, గోపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, లోకేష్‌రెడ్డి, బాబురెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఓ ప్లాంట్ వితరణ



నూతన ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకులంలో తాగునీటి కోసం రూ.1.70 లక్షల విలువతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను సోమవారం ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన సీసీఎల్ ప్రోడక్ట్స్ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద వాటర్ ప్లాంట్‌ను వితరణ చేశారు. సాహితీ గగన్ మహల్ అధ్యక్షుడు, న్యాయవాది ప్రతాపరెడ్డి ప్లాంట్‌ను ప్రారంభించారు. పేద పిల్లల దాహార్తి తీర్చడం అభినందనీయమని గురుకులం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఆనంద్‌బాబు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి నివాళి



గోపాల్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వేణురెడ్డి

చిలమత్తూరు: హిందూపురం రూరల్ మండలం గొల్లాపురం పంచాయతీ గుడ్డంపల్లిలో వైఎస్సార్‌సీపీ నేత కురుబ గోపాల్ సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి వారి గ్రామానికి వెళ్లి గోపాల్ మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తిప్పేరుద్రయ్య, సర్పంచ్ దేవరాజు, చంద్ర, శ్రీనివాసులు, తిమ్మయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు



స్టేషన్‌లో టికెట్ కౌంటర్ గది ప్రారంభంలో పాల్గొన్న అధికారులు

సోమందేపల్లి: రైల్వే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామని ఆ శాఖ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఏడీఈఎన్ నాగభూషణం తెలిపారు. సోమవారం చాకర్లపల్లి రైల్వేస్టేషన్‌లో ఆధికారికంగా టికెట్ కౌంటర్‌తో పాటు రైలు నిలుపుదల ప్రక్రియను ప్రారంభించారు. ప్రతి నెల స్టేషన్ నుంచి టికెట్ రూపంలో రూ.లక్ష ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చుట్టుపక్కల ప్రజలు రైలు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చాకర్లపల్లి రైల్వేగేట్ వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారన్నారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి రిమాండ్

హిందూపురం: హిందూపురం టూటౌన్ పోలీసుల విధులకు ఆటంకం కల్గించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి సోమవారం కోర్టు హాజరుపర్చగా జడ్జి 14 రోజులు రిమాండ్ ఆదేశించినట్లు సీఐ అబ్దుల్ కరీం తెలిపారు. రెండు రోజుల క్రితం రహమత్‌పురంకు చెందిన ముహమ్మద్ ఇర్ఫాన్ మద్యం మత్తులో విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిపై దురుసుగా వ్యవహరించాడన్నారు. అతన్ని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చినట్లు చెప్పారు. జడ్జి అతనికి 14 రోజుల రిమాండ్ విధించిందారన్నారు.

అనధికారికంగా విద్యుత్ వినియోగిస్తే చర్యలు



వాటర్ వర్క్స్ బోరుబావి వద్ద విద్యుత్ మీటర్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ డీఈ వివేకానందస్వామి

రొళ్ల: విద్యుత్ మీటర్లు లేకుండా అనధికారికంగా విద్యుత్‌ను వినియోగిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యుత్‌శాఖ విజిలెన్స్ డీఈ వివేకానందస్వామి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో విద్యుత్‌శాఖ ఏఈ నిజాముద్దీన్‌తో కలిసి పర్యటించారు. స్థానిక వాటర్ వర్క్స్ బోరుబావి, అంగళ్లు, హార్డ్‌వేర్ షాపులు, కుటీర పరిశ్రమలు, గృహ వినియోగదారులతో పాటు పిండి మిషన్లు యజమానులు తదితరులు విద్యుత్ కనెక్షన్లు పొంది ఇది వరకే అమర్చిన విద్యుత్ మీటర్లను పరిశీలించారు. తొలుత విద్యుత్ మీటర్ల వినియోగానికి సంబంధించిన రీడింగ్ సక్రమంగా చూపిస్తున్నాయా? లేదా? అని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ డీఈ వివేకానందస్వామి మాట్లాడుతూ వ్యవసాయ బోరుబావులు కలిగిన రైతులు తప్పనిసరిగి సర్వీస్ చార్జ్ కింద ప్రతి నెలా రూ.30 చెల్లించాలన్నారు. వాణిజ్య, వ్యాపార లావాదేవీల సముదాయాలు, అంగళ్ల యజమానులు ఎవరైనా మీటర్లు లేకుండా అనాధికారికంగా విద్యుత్ వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ లైన్‌మాన్ నరసింహమూర్తి, విజిలెన్స్ కానిస్టేబుల్ లక్ష్మీకాంత్, విజిలెన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలని వినతి

మడకశిరరూరల్: ఆర్డీటీ పై విధించిన ఆంక్షలను తొలగించి యథావిధిగా సంస్థ సేవలను కొనసాగించాలని హోం మంత్రి అనితకు సోమవారం మడకశిరలో దళిత సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయించి ఆర్డీటీ సేవలను పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ ఎమ్మార్పీఎస్ కన్వీనర్ పెద్దన్న, జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు మూర్తి, నాయకులు నరసింహులు, నాగరాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మడకశిర: నియోజకవర్గ పర్యటనకు వచ్చిన హోం మంత్రి అనితను సోమవారం స్థానిక యూటీఎఫ్, ఎంఈఎఫ్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలపై వారు మంత్రికి వినతి పత్రం ఇచ్చి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అలాగే పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమస్యలను పరిష్కరించడానికి మంత్రి హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఎంఈఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భూతన్న, జిల్లా కార్యదర్శులు మాలింగప్ప, ఈశ్వరప్ప, యూటీఎఫ్ నాయకులు జోగప్ప తదితరులు ఉన్నారు.

రికార్డులు పక్కాగా నిర్వహించాలి

పరిగి: పాఠశాలలో రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఎంఈఓ లక్ష్మీదేవి సూచించారు. సోమవారం మండలంలోని కొడిగెనహళ్లిలో పద్మ సాయి ప్రైవేటు పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అలాగే మౌళిక వసతులు, నాణ్యమైన విద్యాబోధనపై కరస్పాండెంట్ శ్రీధర్‌తో ఆరా తీశారు.

వాహనానికి నిప్పు

గోరంట్ల: స్థానిక సాయి పెట్రోల్ బంకు ఎదురుగా చౌడేశ్వరీకాలనీకి చెందిన మునిస్వామి అనే వ్యక్తి తన సప్లయర్స్ షాపు ఎదురుగా నిలిపిన బొలెరో వాహనానికి ఆదివారం అర్ధరాత్రి దుండగులు నిప్పు పట్టారు. వాహనం కాలిపోవడంతో రూ.1,50,000 నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్ ఫిర్యాదు చేశారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

హిందూపురం: పట్టణ సమీపంలోని కొట్నూరు రహదారిలో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పెనుకొండ ప్రాంతానికి చెందిన శ్రీనానాయక్, నాగరాజు ప్రైవేట్ కళాశాలలో పనిచేస్తున్నారు. విధులు ముగించుకుని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా కొట్నూరు సమీపంలో ఎదురుగా వేగంగా వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో కారులో ఉన్న వారికి స్వల్పంగా గాయాలు కాగా ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న శ్రీనానాయక్, నాగరాజులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని హిందూపురం, ఆ తర్వాత బెంగళూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బోనాల కుండల పంపిణీ

సోమందేపల్లి: తొగట వీర క్షత్రియుల ఆరాధ్య దైవం చౌడేశ్వరి జయంతి సందర్భంగా మహిళా భక్తులకు వెయ్యి బోనాల గుండాలు అందజేసినట్లు తొగట వీర క్షత్రియుల సంఘం అధ్యక్షుడు హరిదాస్ తెలిపారు. సోమవారం పెద్దమ్మ ఆలయం వద్ద మహిళలకు బోనాల కుండలు అందజేశారు. ఈ నెల 25న గ్రామంలో జరిగే బోనాల ఉత్సవంలో అందరూ పాల్గొనాలన్నారు.



వేరుశనగ విత్తనాలను విత్తుతున్న రైతులు

వేరుశగ విత్తులో అన్నదాతలు

మడకశిర రూరల్: మండలంలో ఆదివారం రాత్రి మోస్తారు వర్షం కురిసింది. మడకశిర మండలంలో 25.2 ఎంఎం, అమరాపురంలో 40.8, అగళిలో 5.2, గుడిబండలో 27.8 , రొళ్లలో 6.4 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. దీంతో సోమవారం పలు గ్రామాల్లో రైతులు పొలాల్లో వేరుశనగ విత్తనాలు విత్తుకుంటున్నారు.

అభివృద్ధి పనులెక్కడ చేస్తున్నారో చెప్పండి

- సమస్యలపై స్పందించకపోతే ఎలా
- కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల మండిపాటు



సమస్యలపై మాట్లాడుతున్న కౌన్సిలర్ నాగేంద్రబాబు

హిందూపురం టౌన్: వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చినా అధికారులు స్పందించడం లేదని పలువురు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో హిందూపురం పాలక సంఘం అత్యవసర సమావేశాన్ని మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు 22 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. అజెండాపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లతో పాటు అధికార టీడీపీ కౌన్సిలర్లు సైతం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి కౌన్సిల్ సభ్యుల దృష్టికి తీసుకువచ్చిన అభివృద్ధి పనుల్లో ఒక్కటైనా ఆయా వార్డు కౌన్సిలర్లకు అడిగి ప్రతిపాదనలు సిద్ధం చేశారా అంటూ పలువురు కౌన్సిలర్లు మండిపడ్డారు. చైర్మన్ ఎంపిక జరిగే వరకు అందరికీ మాయ మాటలు చెప్పి ఇప్పుడు కూరలో కరివేపాకులా తీసి పారేశారని వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వెళ్లిన కౌన్సిలర్ రహమత్ బీతో పాటు పలువురు కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. వార్డు అభివృద్ధి కోసమే అధికారంలో ఉన్న టీడీపీకి మద్దతు ఇచ్చినప్పటికీ పైసా కూడా కేటాయించలేదన్నారు. దీనిపై స్పందించిన చైర్మన్ రమేష్‌కుమార్ గతంలో వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో అభివృద్ధిపై ఎందుకు ప్రశ్నించే లేదని, తాము అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు మాత్రమే అయిందని, త్వరలో అన్ని వార్డులకు నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేస్తామన్నారు. అధికారులు ఇష్టం వచ్చిన విధంగా అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారని, తమ వార్డులో చాలా సమస్యలు ఉన్నప్పటికీ వాటిని ఏమాత్రం పట్టించుకోవడంలేదని కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. పలువురు కౌన్సిలర్లు ప్రతినెలా జరిగే కౌన్సిల్ సమావేశంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు అధికారులు ఆమోదం తీసుకుంటున్నారని, అయితే పనులు ఎక్కడ చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. పురపాలక సంఘంలో ఉన్న కరువు నిధులు మరమ్మతుల పేరిట అధికారులు సిద్ధం చేసిన ప్రతిపాదనలపైన పలువురు కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై సమగ్రంగా పరిశీలించి పనులు చేపట్టాలని సూచించారు. గందరగోళం మధ్యనే అజెండాలోని అంశాలకు ఆమోదం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, కమిషనర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

అవాస్తవాలను వైరల్ చేస్తే చర్యలు

హిందూపురం: హిందూపురంలో కొద్ది రోజులుగా సోషల్ మీడియాలలో వైరల్ అవుతున్న వీడియో అవాస్తవమని హిందూపురం డీఎస్పీ మహేష్ తెలిపారు. మోడల్ కాలనీ, ఆర్టీఓ ఆఫీస్ అండర్ బ్రిడ్జి దారుల్లో వాహనాల్లో వెళ్తున్న వారిపై దయ్యం దాడి చేసిందన్న ప్రచారంలో నిజం లేదన్నారు. ఇలాంటి ఫేక్ వీడియోలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రి సమయాల్లో ఆయా ప్రాంతాల్లో పోలీస్ సిబ్బంది గస్తీ తిరుగుతుంటారన్నారు. ఏదైనా అనుమానం వస్తే హిందూపురం 1టౌన్ సీఐ నంబర్ 9440796844, టూటౌన్ సీఐ నంబర్ 9440796845, రూరల్ సర్కిల్ సీఐ నంబర్ 9440796846, హిందూపురం యూసీఎస్ సీఐ నంబర్ 9440796847లకు తెలియజేయచ్చన్నారు.

గుడిబండలో సుపరిపాలనలో తొలి అడుగు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న హోం మంత్రి అనిత

గుడిబండ: రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, సవిత, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సోమవారం మండల కేంద్రంలో సోమవారం సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం టీడీపీ చెందిన కార్యకర్తల ఇళ్లకు మాత్రమే వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

హిందూపురం: మండలంలోని కగ్గల్లు గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. గ్రామ సమీపంలో గడ్డిమోపుతో సురేష్ ద్విచక్ర వాహనంలో వస్తుండగా ఎదురుగా మరో ద్విచక్ర వాహనంపై వచ్చిన హనుమంతప్ప పరస్పరం ఢీ కొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులా?

అమరాపురం: బాబు ష్యూరిటీ మోసం .. గ్యారెంటీ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలపై మాట్లాడినందుకే హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు రమేష్‌రెడ్డిపై కేసు నమోదు చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ విమర్శించారు. రమేష్‌రెడ్డిపై పెట్టిన అక్రమ కేసును వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ అన్యాయాన్ని ప్రశ్నించే హక్కు ఉందన్నారు. సోషల్ మీడియాలో వ్యతిరేకంగా పోస్టులు పెడితే వాళ్లను కాలగర్భంలో కలుపుతామని మంత్రిస్థాయి వ్యక్తే హెచ్చరించడం హేయమన్నారు.

కక్ష పూరిత రాజకీయాలు సరికాదు

అమరాపురం: కక్ష పూరిత రాజకీయాలు సరికాదని , అలాంటి వాటిని మానుకోవాలని ఎంపీపీ ఈరన్న పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ కక్షపూరిత రాజకీయాలు తారాస్థాయికి చేరుకున్నాయన్నారు. మద్యం కేసు ఓ మిథ్య అని, అక్రమంగా ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో మద్యం దుకాణాలు నడిస్తే అవినీతి ఎక్కడ జరుగుతుందని ప్రశ్నించారు. మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటికి వస్తారని స్పష్టం చేశారు.

హోంమంత్రి పర్యటనతో ఒరిగింది శూన్యం

మడకశిర: రాష్ట్ర హోం మంత్రి అనిత పర్యటనతో మడకశిరకు ఒరిగిందేమీ లేదని ప్రజలు అంటున్నారు. మడకశిర అభివృద్ధికి మంత్రి పర్యటన ఏమాత్రం ఉపయోగపడలేదన్నారు. కనీసం నియోజకవర్గంలో పోలీసులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి కూడా మంత్రి హామీ ఇవ్వకపోవడం దురదృష్టకరమంటున్నారు. మడకశిర కేంద్రంగా పోలీస్‌సబ్ డివిజన్ ఏర్పాటుపై కూడా మంత్రి ఏమాత్రం స్పందించలేదని, ఈ పర్యటన స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు వ్యక్తిగత పరువు, ప్రతిష్టను పెంచడానికి ఉపయోగపడిందని చెబుతున్నారు. మంత్రి అనిత ఎక్కువగా ఎమ్మెల్యేని పొగిడేందుకు ప్రాధాన్యత ఇచ్చారంటున్నారు. ఇదిలా ఉండగా మంత్రి అనిత పర్యటనకు ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో స్పందనరాలేదు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోండి

ప్రశాంతి నిలయం: భూ వివాదంలో తమకు అనుకులంగా పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని పుట్టపర్తి ఆర్డీఓ ఇచ్చిన ఉత్తర్వులను గోరంట్ల తహసీల్దార్ లెక్కచేయడం లేదు. పాసు పుస్తకం మంజూరు చేయడంలేదు. వెంటనే తహసీల్దార్ పై చర్యలు తీసుకోవాలని గోరంట్ల మండలం పులేరు మజరా పరిధిలోని మల్లెడ్డిపల్లికి చెందిన లక్ష్మీనరసమ్మ కలెక్టర్ టీఎస్ చేతన్‌కు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఆమె వివరాలమేరకు.. గోరంట్ల గ్రామ పొలంలో సర్వే నంబర్ 616-1లో 4.12 ఎకరాలు, సర్వే నంబర్ 608-2సీలో 12-02 ఎకరాల పొలం తన అమ్మ జీలం నారాయణమ్మ నుంచి తనకు సంక్రమించిందని లక్ష్మీనరసమ్మ తెలిపారు. 1975 తనకు అర్ధభాగం, తన పెదనాన్న జీలం నరసప్ప కుమారులకు అర్ధభాగం సంక్రమించేలా ఒప్పందం చేసుకున్నామన్నారు. అయితే మొత్తం ఆస్తి పెదనాన్న కుమారుల మీదే పాసుపుస్తకం చేశారని, ఇదే వ్యవహారంపై పుట్టపర్తి ఆర్డీఓ కోర్టులో ఆర్ఓఆర్ అప్పీలు చేసి వారి పట్టాదారు పాసుపుస్తకం రద్దు చేయాలని ఆర్డీఓ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అయితే వాటిని అమలు చేయకుండా గోరంట్ల తహసీల్దార్ తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వెంటనే అతనిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

ఘనంగా కెంపేగౌడ జయంతి



జ్యోతులు మోస్తున్న మహిళలు

పావగడ: తాలూకాలోని సీకే పురం గ్రామంలో వక్కలిగ సామాజిక వర్గం ఆధ్వర్యంలో బెంగళూరు నగర నిర్మాత, నాడ ప్రభు కెంపేగౌడ 516వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెంపేగౌడ చిత్ర పటానికి పూజలు చేశారు. అనంతరం చిత్ర పటాన్ని గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. వక్కలిగ మహిళలు జ్యోతులు మోశారు. తర్వాత గ్రామంలో కెంపేగౌడ విగ్రహ ఏర్పాటుకు స్థలం అందించాలని యువకులు గ్రామ పంచాయతీ అధికారులను కోరారు.

డీహెచ్‌పీఎస్ ఉపాధ్యక్షుడి హౌస్ అరెస్ట్

రొళ్ల: మండల పరిధిలోని అలుపనపల్లికి చెందిన డీహెచ్‌పీఎస్ ఉపాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు శ్రీనివాస్‌ను సోమవారం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. సోమవారం హోం మంత్రి అనిత మడకశిర పర్యటన సందర్భంగా దళితుల సమస్యలను విన్నవించుకోవడం కోసం బయలు దేరినక్రమంలో హౌస్ అరెస్ట్ చేయడాన్ని శ్రీనివాస్ ఖండించారు. ఇలాంటి అక్రమ అరెస్టులకు భయపడేది లేదన్నారు.

ఆసియాలోనే పావగడ నంబర్‌వన్



తాగునీటి యోజనను కుళాయి తిప్పి ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

పావగడ: రెండు వేల మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం ఉన్న సోలార్ ప్రాజెక్ట్ నిర్మాణంతో పావగడ ఆసియా ఖండంలోనే నంబర్ వన్ స్థానానికి చేరుకుందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. స్థానిక మహాత్మాగాంధీ క్రీడా మైదానంలో సోమవారం నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఫ్లోరైడ్ నీటితో తాలూకా వ్యాప్తంగా ప్రజలందరూ వివిధ రోగాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్థానిక మాజీ మంత్రి వెంకటరమణప్ప చొరవతో ఫ్లోరైడ్ రహిత తాగునీరు అందించడానికి సుమారు రెండు వందల కిమీ దూరంలో ఉన్న తుంగభద్ర డ్యాం బ్యాక్ వాటర్ నుంచి రూ 2,529 కోట్లతో పావగడతో పాటు 6 తాలూకాలు, పావగడ, మొలకాల్మూరు పట్టణాలకు సైతం రక్షిత తాగునీటిని పైపుల ద్వారా అందిస్తున్నామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన 5 గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జేడీఎస్, బీజేపీలు కడుపు మంటతో అబద్ధాలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తథ్యమన్నారు. ఇదిలా ఉంటే సీఎం సిద్ధ రామయ్య హెలికాప్టర్‌లో కాకుండా రోడ్డు మార్గంలోనే వచ్చారు. తుంగభద్ర తాగు నీటి పథకం, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల హాస్టల్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను వేదిక మీద నుంచే బటన్ నొక్కి ప్రారంభించారు.